క్లుప్తంగా

ఆరోగ్యంపై దృష్టి సారించాలి



పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తి

సంగారెడ్డి టౌన్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర అన్నారు. శనివారం జిల్లా కోర్టులో మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయాలని వీలైనంతవరకు టెస్టులు చేయించుకోని మందులు వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కోర్టులోని న్యాయవాదులందరూ క్యాంపులో పాల్గొని పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో జడ్జిలు, డీఎంహెచ్ఓ గాయత్రీదేవి, న్యాయవాదులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలంలో మోస్తరు వర్షం


న్యాల్‌కల్‌లో రోడ్డుపై పారుతున్న నీరు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘాలు కమ్ముకొని రాత్రి ఉరుములతో కూడిన వర్షం పడింది. దీంతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికశాతం పత్తి పొలాల్లోనే ఉండడం, ఉన్నట్లుండి వర్షం పడడంతో వారు ఆందోళనకు గురయ్యారు. పత్తి తీసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలు కూడా ఇబ్బందులు పడ్డారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం కడ్పల్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఎన్‌టీటీడీ ఏటీఏ సాఫ్ట్‌వేర్ సంస్థ డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం సహకారం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ ఆచర్య, హెచ్ఎం వెంకటేశం పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ

నారాయణఖేడ్: ఖేడ్ మండలం చాప్టా(కె) గ్రామంలో శనివారం భూలక్ష్మీవిగ్రహం, విశ్వగురు బసవేశ్వర విగ్రహావిష్కరణలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, యంత్ర స్థాపన, శిఖరారోహణ, ధ్వజ స్తంభస్థాపన, బసవేశ్వర పల్లకీసేవ తదితర కార్యక్రమాలు చేశారు. 108 వీరేశ్వరథనసిరి మహారాజ్, డా.బసవలింగ ఆధ్యాత్మిక ప్రవచనాలిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, అప్పారావు, సాగర్ పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్

సంగారెడ్డి జోన్: ప్రజాపాలన విజయోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు పోలీసు శాఖ వినియోగిస్తున్న వివిధ రకాల ఆయుధాల పని తీరును గురించి, ఏ ఆయుధాలను ఎలాంటి పరిస్థితుల్లో వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో ఆర్మోరర్ రాములు యాదవ్ ఎ.ఆర్.ఎస్ఐ, రమేష్ హెడ్ కానిస్టేబుల్ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు అందించండి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులను మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆదేశించారు. ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎంపీ దృష్టికి సభ్యులు తాగునీటి సమస్యపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం జలమండలి ఉన్నతాధికారులతో ఎంపీ రఘునందన్ రావు ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఈ నెల 20 లోపు తాగునీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

నిర్మాణ సామగ్రి చోరీ

నారాయణఖేడ్: నిర్మాణంలో ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని లక్షల విలువ చేసే విద్యుత్ వైర్లు, ఇతర సామగ్రిని గుర్తు తెలియని దుండగలు ఎత్తుకెళ్తున్నారని పట్టణంలోని పలువురు బాధితులు వాపోయారు. శనివారం అంబోజీ కాలనీలో వంశీకృష్ణ ఇంటి పనులు చివరి దశలో ఉండగా విద్యుత్ వైరింగ్ పనులు చేపట్టాడు. గుర్తుతెలియని దుండగలు గోడల్లో వేసి న కేబుల్ వైర్లను కత్తించుకొని చోరీకి పాల్పడ్డారని బాధితుడు వాపోయారు. పట్టణంలోని పలు కాలనీల్లోనూ విద్యుత్, ఇతర నిర్మాణ సామగ్రి చోరీకి గురవుతుందని తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ పెంచి చోరీలను నివారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

గుంతల రోడ్లకు మోక్షం!

- ఆయా గ్రామాల రోడ్లకు మరమ్మతులు
- దశాబ్దాలుగా ప్రయాణికుల అవస్థలు


ముద్దాయిపేట వద్ద చేపట్టిన మరమ్మతు పనులు

పుల్‌కల్ (అందోల్): దశాబ్దాలుగా గుంతలమయంగా మారి, కంకర తేలిన గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. మండలంలోని పోచారం- సంగుపేట, కోడూరు-బొమ్మారెడ్డి గూడ-మాసన్ పల్లి 7 కిలోమీటర్ల రోడ్లు, రూ 4.69 కోట్లు మంజూరు కావడంతో అధికారులు మరమ్మతుల పనులు ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిధులు కేటాయించడమే కాకుండా స్వయంగా పనులను ప్రారంభించారు. అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు మొదలు పెట్టారు. గుంతలరోడ్ల వల్ల ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పోచారం-సంగుపేట రోడ్డుకు మరమ్మతు పనులు చేయడం వల్ల ముద్దాయిపేట, పుల్‌కల్, బస్వాపూర్, ముదిమాణిక్యం, సూరెడ్డి ఇటిక్యాల, గ్రామ ప్రజల ప్రయాణం సాఫీగా సాగనుంది. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడిన వారి సమస్య తీరతుంది. 7 కిలోమీటర్లు మరమ్మతు చేసే రోడ్లు 10 గిరిజన తండాలు, కోడూరు గొంగులూరు, మిన్‌పూర్, కొండారెడ్డిపల్లి గ్రామస్తులకు మేలు జరుగుతోంది. ఇన్నాళ్లు గుంతలమయమైన రోడ్డు వల్ల నియోజకవర్గం కేంద్రం జోగిపేటకు తాడ్‌దాన్‌పల్లి ద్వారా వెళ్లాల్సి వచ్చేదని ప్రజలు తెలిపారు. చుట్టూ తిరిగి పోవడం వల్ల ప్రయాణ ఖర్చులు ఎక్కువయ్యేవని చెప్పారు.

రోడ్డుకు మరమ్మతులు


మన్‌సాన్‌పల్లిలో గుంతల రోడ్లకు మరమ్మతులు

మునిపల్లి(అందోల్): కంకోల్ చౌరస్తా నుంచి తాటిపల్లి మీదుగా రాయికోడ్ మండలం కప్పాడ్ వరకు గుంతలమయంగా మారిన రోడ్డుకు సంబంధిత అధికారులు మరమ్మతుల పనులను ప్రారంభించారు. శనివారం మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామ శివారులో ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

దశాబ్దంగా మరమ్మతులు లేవు..



పోచారం- సంగుపేట రోడ్లు మరమ్మతు చేయడం వల్ల ప్రయాణికులకు మేలు జరుగుతుంది. గుంతల రోడ్ల వల్ల చాలా ప్రమాదాలు జరిగాయి. జోగిపేటకు తాడ్‌దాన్‌పల్లి నుంచి పోయాల్సి వచ్చేది. దీంతో ఖర్చులు పెరిగేది.

-కమాల్ రెడ్డి(మార్కెట్ కమిటీ, డైరెక్టర్

వాహనాలు చెడిపోయేవి



గ్రామీణ రోడ్లు పూర్తిగా ధ్వంసమైయ్యాయి. కంకర తేలిన రోడ్లతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.. వాహనాలు తరుచు మరమ్మతులకు గురయ్యేవి. మండలంలోని రోడ్ల మరమ్మతులు చేయడం వల్ల జోగిపేటకు ప్రయాణం సులభమవుతుంది.

-సాలే శేఖర్, డ్రైవర్, ముద్దాయిపేట

చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

జహీరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరికృష్ణ అన్నారు. శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సూరికృష్ణ మాట్లాడుతూ.. చిన్నారులు చట్టాలపై అవగాహన కలిగి ఉండడం వల్ల వారితో పాటు వారి కుటుంబాలకు సమస్యలు వచ్చినప్పుడు వాటిని అధిగమించడానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. చట్టాలపై అవగాహన కలిగిన విద్యార్థులు తోటి విద్యార్థులకు కూడా తెలియజేయాలన్నారు. బాల్య వివాహల బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా కనిపిస్తే స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, ప్యానల్ అడ్వకేట్ రుద్రయ్య స్వామితో పాటు రాఘవేందర్ నాయక్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరుల

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో సీసీ రహదారులు, మురుగుకాల్వల నిర్మాణానికి టీయూఐఎఫ్‌డీసీ నిధులు రూ.20 కోట్లు మంజూరయ్యాయి. వార్డుల్లోని ఆయా పనులకు శనివారం వారు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో మున్సిపాలిటీ పరిధిలో అన్ని కాలనీల్లోనూ రహదారులు, బైపాస్ రహదారుల విస్తరణ, సీసీ రహదారులు, మురుగు కాల్వలు, వీధిదీపాలు, ఆటంకాలు లేకుండా తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలకు కృషి చేస్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్‌లోని ప్రాథమిక పాఠశాల, మార్వాడీగల్లీలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల సామర్థ్యాలు, సమస్యలు తెలుసుకున్నారు. ఖేడ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షుడి షారూఖ్‌లను ప్రత్యేకంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్, ముఖ్యనాయకులు పండరి రెడ్డి, అవుటి శంకర్, తాహెర్, ముంతాజ్, సిద్ధారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు కొనసాగించాలి

జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు


ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీఈఓ

జోగిపేట (అందోల్): పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులను కొనసాగించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం అందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు నిర్వహిస్తున్న ప్రత్యేక క్లాస్‌ను పరిశీలించారు. తరగతి గదిలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణపై విద్యార్థినులను ఆయన ప్రశ్నించగా చాలా బాగుందని చెప్పారు. పదోతరగతిలో బీ, సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. అలాగే, వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీఈఓ అన్నారు. భోజన విషయంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జ్యోతికి సూచించారు. ఆయన వెంట ఎంఈఓ కృష్ణ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం నరేష్‌కుమార్, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు నరోత్తమ్ కుమార్ తదితరులు ఉన్నారు.

టీఎఫ్‌టీ లైసెన్సులివ్వాలి

కల్లుగీత కార్మిక సంఘం
జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్


గీత కార్మిక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

సంగారెడ్డి టౌన్: అర్హులైన కల్లుగీత కార్మికులకు టీఎఫ్‌టీ అనుమతులు మంజూరు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కల్లు గీయడం రాకున్నా వారిని గీత కార్మికులుగా గుర్తించి వారికి అడ్డదారిలో లైసెన్సులు ఇప్పిస్తున్నారని వాటిని వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈత, తాటి చెట్లను నరికివేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలుగీత కార్మిక సంఘం 67 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న వార్షికోత్సవ సభకు గౌడ కులస్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, కమిటీ సభ్యులు ప్రసాద్ గౌడ్ ,కృష్ణ గౌడ్ శ్రీధర్ గౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో పాల్గొనేందుకు తుది అవకాశం

కమిషనర్ ఎ.జ్యోతిరెడ్డి



పటాన్‌చెరు: సమగ్ర కుటుంబ సర్వేలో ఇప్పటివరకు తమ వివరాలను ఇవ్వలేకపోయినా వారెవరైనా అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని కమిషనర్ ఎ.జ్యోతిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొంతమంది ఇళ్లల్లో అందుబాటులో లేకపోవడంతో వారి వివరాలను సేకరించలేకపోయామన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్ గూడ, ఐలాపూర్ ఐలాపూర్ తాండ, సుల్తాన్పూర్, దాయర గ్రామాలకు చెందిన వారు మున్సిపల్ కార్యాలయానికి ఫోన్ చేసి ఆ సర్వేలో పాల్గొనవచ్చని తెలిపారు. 98854 65065,99636 40541లలో సంప్రదించవచ్చన్నారు.

కాలనీ పార్కుల అభివృద్ధికి కృషి


ఆట వస్తువులను ప్రారంభిస్తున్న పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీల పార్కుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. శనివారం శ్రీసాయినగర్ కాలనీలోని థీమ్ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆట వస్తువులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో కాలనీలో జరిగిన బస్తీదర్శన్ కార్యక్రమం నిర్వహించిన సమయంలో పలువురు మహిళలు పార్కులో చిన్నారుల కోసం ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. అందులో భాగంగా రూ.15లక్షలతో పిల్లల ఆట వస్తువులను ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ పరిధిలోని పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, కాలనీవాసులు మహేందర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజ్‌కుమార్, ప్రకాశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరుకాని కార్యదర్శి

నారాయణఖేడ్: కంగ్టి మండలం భీంరా పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా హాజరు కావడంలేదని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, ఆర్డీఓ అశోక చక్రవర్తికి శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సమస్యలు పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ చుట్టపు చూపుగా విధులకు హాజరవుతున్నాడని ఆరోపించారు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి పూజలు

సదాశివపేట(సంగారెడ్డి): సంగమేశ్వర మందిరంలో శనివారం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య సుబ్రహ్మణ్య షష్టి పూజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉ.9 గంటలకు స్వామి వారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం, భస్మాభిషేకం చేశారు. అనంతరం మందిర ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలచే పల్లకీ సేవ నిర్వహించారు. షష్టిపూజకు హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అకులశివకుమార్, అలయ భజన భక్తబృందం సభ్యులు మల్లేశం, సుధాకర్, రాంరెడ్డి, పరమేశ్వర్, రుద్రప్ప, సుబ్రహ్మణ్యం, మణికంఠ, భక్తులు పాల్గొన్నారు,

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సదాశివపేట(సంగారెడ్డి): నిరుపేదలు సీఎం సహాయనిధిని లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. శనివారం మండలంలోని 25 మంది లబ్ధిదారులకు 7,717,500 విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి వీరేశం, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, సత్యం, రాములు, మొబిన్, శివరాజ్‌పాటిల్, ఇంద్రమోహన్‌గౌడ్, శ్రీశైలం, బరాడి శివ, లలిత పాల్గొన్నారు.

ఫ్యాన్లు అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌లో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ భవనానికి 25 ఫ్యాన్‌లను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి తన సొంత నిధులతో శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు నరసింహ, క్రాంతి, నర్సింగ్, కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


జిన్నారం: పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలోని ఊట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మహా పడిపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని అలంకరించి స్వామివారి 18 మెట్లకు వేద పండితులు, గురుస్వాములు వేద మంత్రాలతో పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్ గౌడ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పూజలో ముత్తంగి నర్సింగరావు, కపిల్ మద్దూరి భజన బృందాలు ఆలపించిన పాటలు అలరించాయి. కార్యక్రమంలో స్థానిక గురుస్వాములు నాగేందర్‌గౌడ్, రవీందర్ గౌడ్, శ్రీనివాసాచారి, శ్రీనివాస్, మంగలి కృష్ణ, ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ మహోత్సవం

పటాన్‌చెరు టౌన్: మండలంలోని భానూర్ గ్రామంలో రవీందర్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన 18వ మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్ గౌడ్, నీలం మధు, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుధా గౌడ్, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హామీలు అమలు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సోమశేఖర్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2004కు ముందు నోటిఫికేషన్‌ల ద్వారా నియామకమైన డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు, ఇతర శాఖల్లోని ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పీఆర్సీ కమిషన్ వేసి సంవత్సరం దాటిన రిపోర్ట్ తెప్పించుకోకపోవడం, గడువు పెంచుతూ పోవడం సరికాదన్నారు. వెంటనే రిపోర్ట్ తెప్పించుకుని పీఆర్సీని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు లక్ష్మయ్య యాదవ్, రాజారెడ్డి, సంజీవయ్య, రాంచందర్ భీంవంశీ, భాస్కర్, సుభాష్‌బాబు, గీతామాలిని, కంరోద్దీన్, వెంకట్ రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బిచ్చయ్య, జనార్దన్ రెడ్డి, నాసర్ పటేల్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్


ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం సీఎం కప్ క్రీడాపోటీలను నిర్వహిస్తుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీం కప్ 2024 పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. క్రీడలు వ్యక్తిలో శారీరక సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. దేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రధాన పాత్రను నిర్వహిస్తాయన్నారు. ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి వివిధ రకాలైన క్రీడలను గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ దశరథ్, ప్రధానోపాధ్యాయులు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్‌లో..

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లోని రాధా కృష్ణ మెమోరియల్ పాఠశాలలో సీఎం కప్ క్రీడాపోటీలు కబడ్డీ, వాలీబాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. అలాగే, వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులకు ఇంటర్నల్ విలేజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.ఎం.షరీఫ్, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

కంగ్టిలో..

కంగ్టి(నారాయణఖేడ్): ఆటలపోటీలతో విద్యార్థుల్లో గెలుపుపై పోటీతత్వం అలవడుతుందని డీఎల్పీఓ సంజీవ్‌రావు అన్నారు. మండలంలోని తడ్కల్, నాగుర్, దామర్‌గిద్దా, కంగ్టి, భీంరా తదితర పాఠశాలల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, ఎంఈఓ రహీమొద్దీన్, ఎంపీఓ సుభాష్, పాఠశాలల ప్రాధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11న సీఎం కప్ పోటీలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 11న సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధి క్రీడాకారులు అథ్లెటిక్స్ వాలీబాల్, పుట్‌బాల్, కబడ్డీ, కోకో పోటీల్లో పాల్గొనేందుకు 10న జిల్లా పరిషత్ హెచ్ఎం మంగీలాల్, పీటీ రమేష్ లకు పేర్లు రిపోర్టు చేయాలని సూచించారు.